AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


2-12-2025 (Tuesday) | MAIN EDITION

## సొరంగంలో ఆగిపోయిన మెట్రోరైలు..



**అక్షరటుడే, చెన్నై:** సాంకేతిక కారణాలతో మెట్రోరైలు సొరంగంలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు నడుచుకుంటూ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన మంగళవారం ఉదయం చెన్నైలో చోటు చేసుకుంది. విమ్కో నగర్ డిపో నుంచి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం వైపు వెళ్లే మెట్రో ట్రైన్‌లో సాంకేతిక సమస్య నెలకొని ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అధికారుల సూచన మేరకు ప్రయాణికులు సమీపంలోని హైకోర్టు స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లారు.

## ఇమ్రాన్ ఖాన్ మృతి వదంతులు.. పాక్‌లో ఉద్రిక్తత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ హత్యకు గురయ్యారన్న వార్తలు ఆ దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. రావల్పిండి అదియాలా జైల్‌లో ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపివేశారన్న ఆరోపణలు అఫ్ఘాన్ టైమ్స్‌లో వెలువడడంతో రాజకీయం వేడెక్కింది. బలూచిస్థాన్ విదేశాంగ శాఖ కూడా పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, నిఘా సంస్థ ఐఎస్ఐలు కలిసి కుట్రపూర్వకంగా హత్య చేశారంటూ ఆరోపణలు చేసింది. అయితే అదియాలా జైలు అధికారులు ఈ వాదనలను ఖండించారు. ఇమ్రాన్ ఖాన్ క్షేమంగా ఉన్నారు. వార్తల్లో ఎలాంటి నిజం లేదు అని స్పష్టం చేశారు.

## బలహీనపడుతున్న వాయుగుండం




**అక్షరటుడే, ఏపీ:** బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ బలహీనపడి వాయుగుండంగా మారింది. ఇది మరింత బలహీన పడనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజులు ఆంధ్రప్రదేశ్‌లోని పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నెల్లూరు, తిరుపతిలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

## గ్లోబల్ సమ్మిట్‌పై సమీక్ష



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం అధికారులతో సమీక్షించారు. సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 5 నాటికి అన్ని పనులను పూర్తి చేయాలన్నారు.

## పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో సినిమాలు ఆడనివ్వబోమన్నారు. తెలంగాణ ప్రజల నరదిష్టి తగలడంతో కొబ్బరి చెట్లు ఎండిపోయాయని ఇటీవల పవన్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కోమటిరెడ్డి స్పందించారు.

## ఒకే రోజు ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య


**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడంతో విషాదం నెలకొంది. ఇద్దరు ఇంటర్ విద్యార్థులు, ఒక ఇంజినీరింగ్ స్టూడెంట్ బలవన్మరణానికి పాల్పడ్డారు. బాచుపల్లి శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన వర్షిత ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమె హాస్టల్ గదిలో చున్నితో ఉరి వేసుకుంది. నిజాంపేట ప్రగతి జూనియర్ కాలేజీలో సెకండియర్ చదువుతున్న మంజూనాథ్ (18) ఆత్మహత్య చేసుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతున్న విజ్ఞాన్ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

**అక్షరటుడే, గద్వాల :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అయింది. కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో సిబ్బంది వారిని ఆస్పత్రికి తరలించారు. హాస్టల్‌లో విద్యార్థులు మంగళవారం ఉదయం టిఫిన్ చేశారు. అనంతరం పాఠశాలకు వెళ్లారు. తర్వాత కొద్దిసేపటికే 15 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దీంతో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ.. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయన్నారు. వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారన్నారు. అనంతరం అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లామన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల వేళ పల్లె రాజకీయ ముఖచిత్రం మారుతోంది. సర్పంచ్‌గా పోటీ చేసేందుకు యువత ముందుకు వస్తోంది. ఉద్యోగులు, విద్యావంతులు బరిలోకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. లక్షల వేతనాలు వచ్చే కొలువులను సైతం వదిలేసి పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులే కాదు.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం పల్లెపీఠంపై కన్నేశారు. ఈ క్రమంలో పట్టణాలను వదిలి గ్రామాల్లో సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు సై అంటున్నారు. ఎస్సై, టీచర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, జర్నలిస్టు.. ఇలా అన్ని రంగాల వారు స్థానిక పోరులో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మొదటి, రెండో విడత ఎన్నికల్లో చాలా మంది ఉద్యోగులు తమ కొలువులకు రాజీనామా చేసి నామినేషన్లు వేశారు. ఉన్నత విద్యావంతులు సైతం పోటీ చేస్తున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




# కొలువులకు గుడ్‌బై..

# పోటీకి సై..

- టీచర్లు, పోలీసులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం..
- సర్పంచ్ పీఠాలపై కన్నేసిన యువతరం
- రాజకీయాల్లోకి ఉద్యోగులు, విద్యావంతులు
- పల్లెల్లో సరికొత్త రాజకీయ ముఖచిత్రం

దాదాపు ఏడేళ్ల తర్వాత రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పోటీకి యువత ముందుకు వస్తున్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డవారు సైతం బరిలో నిలుస్తున్నారు. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా పోటీలోకి దిగారు. ఇంకా ఐదు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న ఆయన.. తన పుట్టిన ఊరు కోదాడ మండలం గుడిబండ గ్రామంలో నామినేషన్ వేశారు. ఇక, మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ కంజర్ల చంద్రశేఖర్ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని ఆయన పోటీ చేయడానికి వచ్చారు. ఈ గ్రామంలో రెండో దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఊరి కోసం తన తాత చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుని ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు.

దోమకొండ కస్తూర్బా పాఠశాల లో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన తునికి ప్రత్యూష తన కొలువుకు రాజీనామా చేసి సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆమె.. అదే రోజు నామినేషన్ వేశారు.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన మల్యాల జాహ్నవి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తన గ్రామంలో నెలకొన్న సమస్యలు తనని ప్రజాసేవ వైపు నడిపించాయని జాహ్నవి తెలిపారు.

### రాజకీయాలపై ఆసక్తితో..

ఎంత ఉన్నత చదువులు చదివినా, ఎంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా.. రాజకీయ నేతల ముందు బలాదురే. ఉద్యోగం, డబ్బు, ఆస్తి ఎంతున్నా ముఖ్యమైన పని పడితే రాజకీయ నేతల వద్దకు వెళ్లాల్సిందే. ఒక్కసారి పదవిలోకి వస్తే ఆ అధికార దర్పం వేరే లెవల్ గా ఉంటుంది. అందుకే ప్రస్తుతం యువత రాజకీయాల వైపు దృష్టి సారిస్తున్నారు. కొలువులు సైతం వదిలి పల్లెల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే చాలా మంది తమ పదవులకు రాజీనామా చేసి, నామినేషన్లు వేశారు. కామారెడ్డి జిల్లాలో ఓ మహిళా ఉద్యోగి తన టీచర్ కొలువుకు రాజీనామా చేసి, నామినేషన్ వేశారు. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పని చేస్తున్న పలువురు జర్నలిస్టులు సైతం పోటీలోకి దిగారు.

## హైదరాబాద్‌లో ఐటీ సోదాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో మరోసారి ఐటీ అధికారుల సోదాల కలకలం రేపాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం అధికారులు తనిఖీలు నిర్వహించారు. నగరంలోని వుడ్ బ్రిడ్జ్ హోటల్ యజమాని ఇంట్లో సోదాలు చేపట్టారు. హోటల్ ఓనర్ అలీఖాన్‌ను విచారించారు. నగరంలోని పలు హోటళ్ల యజమానుల ఇళ్లపై ఇటీవల అధికారులు సోదాలు చేశారు. పిస్తాహౌజ్, షా గౌస్, మైహిఫ్ల్ హోటళ్ల యజమానులు, డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాల్లో రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. ఆయా హోటళ్ల నిర్వాహకులు పన్ను ఎగవేతకు పాల్పడ్డట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మరోసారి నగరంలో సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. వుడ్ బ్రిడ్జ్ హోటల్ యజమానికి షాగౌస్, పిస్తాహౌస్ హోటళ్లతో సంబంధాలపై ఆరా తీశారు.

## సోనియా, రాహుల్‌పై కేసులు పెడితే భయపడం : సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కేసులు పెడితే భయపడమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇటీవల ఢిల్లీ పోలీసులు వారిపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా సీఎం స్పందించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం ఈ దేశం కోసం అనేక త్యాగాలు చేసిందన్నారు. నెహ్రూ కుటుంబం ఆగర్భ శ్రీమంతుల కుటుంబం అని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చారు, ఆస్తులు ధారపోశారని చెప్పారు. స్వతంత్రం రావడంలో నేషనల్ హెరాల్డ్ పత్రికది ప్రముఖపాత్ర అని చెప్పారు. డిసెంబర్ 7న ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తున్నట్లు సీఎం తెలిపారు. ఉద్దండులను అందించిన ఓయూను కేసీఆర్ కాలగర్భంలో కలిపారని విమర్శించారు. ఓయూను ప్రపంచ స్థాయిలో నిలబెడతామని, ఎంతైనా ఖర్చు పెడతామని చెప్పారు.



## మాల్దీవుల్లో వెకేషన్‌కు రకుల్..

**టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ సోషల్ మీడియాలో హీట్ పెంచింది. ఎప్పటికప్పుడు తన లైఫ్‌స్టైల్, ఫిట్‌నెస్, ఫ్యాషన్ అప్‌డేట్స్‌తో అభిమానులను అలరించే రకుల్, తాజాగా మాల్దీవులకు వెకేషన్‌కి వెళ్లి అక్కడి అందమైన క్షణాలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. భర్త జాకీ భగ్నానీతో కలిసి బీచ్ తీరం వద్ద గడిపిన రొమాంటిక్ మూమెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ చూసిన అభిమానులు పెళ్లయినా రకుల్ గ్లామర్ ట్రీట్ ఆపడంలేదుగా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. పొట్టి డ్రెస్సుల్లో రకుల్ క్యూట్‌నెస్ అదుర్స్ అంటూ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**

## 'సంచార్ సాథీ'పై వెనక్కి తగ్గిన కేంద్రం





**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** 'సంచార్ సాథీ' అంశం దేశవ్యాప్తంగా దుమారం రేపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఫోన్ల నుంచి డిలీట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం అన్ని ఫోన్ల తయారీ సంస్థలను ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విపక్షాలు మండిపడ్డాయి. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభలను మంగళవారం స్తంభింపజేశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌ల నుంచి సంచార్ సాథి యాప్‌ను తొలగించవచ్చని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. "మీరు సంచార్ సాథి వద్దనుకుంటే దానిని తొలగించవచ్చు. ఇది ఐచ్ఛికం... ఈ యాప్‌ను అందరికీ పరిచయం చేయడం మా విధి. దానిని వారి పరికరాల్లో ఉంచుకోవాలా వద్దా అనేది వినియోగదారుల ఇష్టం" అని ఆయన సభలో ప్రకటన చేశారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు



**అక్షరటుడే, హైదరాబాద్ :** దేశంలో బాంబు బెదిరింపులు ఆగడం లేదు. నిత్యం ఏదో ఒక ప్రాంతానికి బెదిరింపు మెయిల్స్, కాల్స్ వస్తున్నాయి. దీంతో అధికారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇందులో చాలా వరకు నకిలీ బెదిరింపులు ఉంటున్నాయి. ఇండిగో విమానానికి తాజాగా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఫ్లైట్ సోమవారం అర్ధరాత్రి 1:30 గంటలకు కువైట్ నుంచి బయలు దేరింది. మంగళవారం ఉదయం 8:10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. అయితే విమానంలో మానవ బాంబు ఉందని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులకు మెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విమానాన్ని అత్యవసరంగా ముంబైలో ల్యాండింగ్ చేశారు. విమానంలో బాంబ్‌స్క్వాడ్‌తో సోదాలు నిర్వహించారు. విమానంలో ఎటువంటి పేలుడు పదార్థాలు కనిపించలేదు.

## పాక్ సరిహద్దుల్లో 69 యాక్టివ్ ఉగ్రస్థావరాలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం అయినప్పటికీ, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఐజీ అశోక్ యాదవ్ వెల్లడించారు. మొత్తం 69 ఉగ్రశిక్షణ శిబిరాలు ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్నాయని, వాటిలో సుమారు 100-120 మంది ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. భారత్‌లోకి చొరబడేందుకు అవకాశాల కోసం ఉగ్రవాదులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన ఒక ఘటనలో, ఎనిమిది మంది ఉగ్రవాదులు నాలుగు విడతల్లో చొరబాటుకు యత్నం చేసినా.. బీఎస్ఎఫ్ దళాలు అందరి కదలికలను ముందుగానే గుర్తించి, వారిని మట్టుబెట్టినట్లు వివరించారు.